క్లుప్తంగా

అన్నంపల్లిలో గోపాష్టమి పూజలు



పార్వతీ గౌతమేశ్వరుని సన్నిధిలో అర్చకుల పూజలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలోని శ్రీ పార్వతీ గౌతమేశ్వర స్వామి ఆలయంలో కార్తిక శనివారం గోపాష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యలమంచిలి సతీష్, పుల్లా పంతులు ఆధ్వర్యంలో 12 మంది ఋత్వికుల మంత్రోచ్ఛారణల మధ్య మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కుంకుమ పూజ, జ్యోతిర్లింగార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అన్న సమారాధనలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ స్వాధీనం

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమంగా ఆటోలో డీజిల్ తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 330 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన గాదె సురేష్ శనివారం ఆటోలో యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.

బాబ్జీ మృతికి పొన్నాడ సంతాపం

తాళ్లరేవు: గుండెపోటుతో మృతి చెందిన సుంకరపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు గంగుల బాబ్జీ మృతికి ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సంతాపాన్ని తెలిపారు. శనివారం బాబ్జీ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, నాయకులు కాశి లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం



కరపత్రాలను చూపుతున్న సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, మహిళలు

ఉప్పలగుప్తం: విద్యుత్ చార్జీలు పెంచి కూటమి ప్రభుత్వం పేదలపై అదనపు భారం మోపిందని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని భీమనపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ 8 నుంచి 15 వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపోరు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 14న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వ విధానాలను ఎండగడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగాయన్నారు. వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీర వెంకటరావు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి సప్త హారతులు



ఆలయంలో బారులు తీరిన భక్తులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పల్లిపాలెంలో కార్తికమాసం రెండో శనివారం పురస్కరించుకొని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, సప్త హారతులు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పల్లిపాలెం 216 జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించినట్లు ఆలయ నిర్వాహకులు పెన్మత్స చిట్టిరాజు తెలిపారు.

అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా స్వామినాయుడు

అమలాపురం రూరల్: అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ (అముడా) చైర్మన్‌గా అమలాపురానికి చెందిన టీడీపీ నాయకుడు అల్లాడ స్వామినాయుడు నియమితులయ్యారు. రాష్ట్రంలో 58 నామినేటెట్ కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో భాగంగా స్వామినాయుడిని అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు విడుదల చేశారు. నాయుడు జిల్లా టీడీపీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కూటమి నాయకులు మెట్ల రమణబాబు, ఏడిద శ్రీనువాస్, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా శ్రీధర్‌లు నాయుడు నియామకంపై హర్షం వెలిబుచ్చారు.

నిర్వహణ లేని నిర్మాణమేల!

- నిర్లక్ష్యం నీడలో బొటానికల్ గార్డెన్
- అలంకార ప్రాయంగా మ్యూజికల్ ఫౌంటైన్
- కోట్లాది రూపాయలతో నిర్మాణం
- పర్యవేక్షణ లేక మూలకు చేరిన యంత్రాలు
- నిరాశతో వెనుదిరుగుతున్న పర్యాటకులు



పర్యవేక్షణ లేక నిరుపయోగంగా మారిన మ్యూజికల్ ఫౌంటైన్

యానాం: పర్యాటక ప్రాజెక్టుల పేరిట కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణాలు చేసినప్పటికీ నిర్వహణ లేక అలంకార ప్రాయంగా మారుతున్నాయి. దీంతో వాటిని చూసేందుకు వచ్చే పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. యానాం పట్టణంలో బొటానికల్ గార్డెన్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణం చేసిన మ్యూజికల్ ఫౌంటైన్, లేజర్‌షో పని చేయక పోవడంతో అది కాస్తా మూలకు చేరింది.

బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తీసుకున్న 55 ఎకరాల విస్తీర్ణంలో మంచినీటి చెరువును ఆనుకొని ఉన్న స్థలంలో బొటానికల్ గార్డెన్‌ను నిర్మించారు. దీనికి గానూ సుమారు రూ.8 కోట్ల పర్యాటక శాఖ నిధులను ఖర్చు చేశారు. ముఖ్యంగా సైన్స్ విద్యార్థులకు ఉపకరించే విధంగా బొటానికల్ గార్డెన్‌ను నిర్మిస్తారని భావించినప్పటికీ కేవలం ఒక భవంతిని నిర్మాణం చేసి వదిలేశారు. బొటానికల్ గార్డెన్‌లో ఉండాల్సిన మొక్కలు మాత్రం అక్కడ ఏర్పాటు చేయలేదు. 2016లో దీనిని ప్రస్తుత సీఎం రంగసామి ప్రారంభించారు. అనంతరం మళ్లీ అదే స్థలంలో రూ.2 కోట్ల నిధులతో మ్యూజికల్ ఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు. మ్యూజికల్ ఫౌంటైన్‌తో పాటు దానికి అనుసంధానంగా లేజర్‌షో వేసే విధంగా ఏర్పాట్లు చేశారు. 2019లో సౌండ్ అండ్ లైట్ షో పేరిట అప్పటి సీఎం నారాయణసామి దీనిని ప్రారంభించారు. అప్పటి నుంచి కొంతకాలం పని చేసి ఆ తర్వాత పని చేయడం మానేసింది.

ప్రజాధనం వృథా

కోట్లాది రూపాయల ఖర్చుతో బొటానికల్ గార్డెన్‌లో నిర్మాణం చేసిన మ్యూజికల్ ఫౌంటైన్‌కు సంబంధించిన యంత్రాలు, మోటార్లను సంబంధిత పీడబ్ల్యూడీ యంత్రాంగం నిర్వహణ చేయాల్సి ఉంది. ఎప్పటికప్పుడు యంత్రాలను పర్యవేక్షిస్తూ ఉండాలి. అయితే గత రెండేళ్లుగా దీనిపై అధికారులు దృష్టి సారించలేదు. దీంతో యంత్రాలు కాస్తా పని చేయని పరిస్థితికి వచ్చాయి. దీనికి తోడు అక్కడ నిల్వ ఉంచిన నీరు సైతం రంగుమారి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. మ్యూజికల్ ఫౌంటెన్‌లో నీరు నాచు పట్టి మురుగునీరుగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికార యంత్రాంగం

బొటానికల్ గార్డెన్ ప్రాంతం సంబంధిత పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పర్యవేక్షణలో ఉంటుంది. వాటి నిర్వాహణా బాధ్యత అంతా వారిదే. అయితే సంబంధిత అధికారులు వీటి నిర్వహణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బొటానికల్ గార్డెన్‌లో పచ్చదనం లేక కళావిహీనంగా మారిందని, పర్యాటకులకు కావాల్సిన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా సంక్రాంతి మూడు రోజులు మ్యూజికల్ ఫౌంటెన్, లేజర్‌షో ప్రదర్శిస్తుంటారు. మూలన పడ్డ మ్యూజికల్ ఫౌంటెన్‌ను రానున్న పండగ నాటికైనా సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పునర్ వైభవం తీసుకురావాలి



పర్యాటక శాఖ ద్వారా నిర్మాణం చేసిన పలు నిర్మాణాలు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. బొటానికల్ గార్డెన్, మ్యూజికల్ ఫౌంటెన్‌ను కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణం చేసినప్పటికి నిరుపయోగంగా ఉంది. పనిచేసేలా అధికారులు దృష్టి సారించాలి.

వడ్డి ఏడుకొండలు, విశ్వజన కళామండలి అధ్యక్షుడు, యానాం.



పిచ్చిమొక్కలతో కళావిహీనంగా మారిన బొటానికల్ గార్డెన్



గార్డెన్ ముఖద్వారం



గతంలో ప్రదర్శించిన లేజర్‌షో

‘యూత్ లీడర్‌షిప్ వర్క్‌షాప్’ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వివేకానంద సేవాసమితి నాయకులు

అమలాపురం రూరల్: స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూత్ లీడర్ షిప్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జి నాగరాజు, పీవీ కృష్ణ, జి.అంజని శ్రీనివాస్‌లు తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం అమలాపురం సర్ సీవీ రామన్ స్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 17న ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతుందన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు యువతీ యువకులు, ఉపాధ్యాయులు పాల్గొనవచ్చునని తెలిపారు. పాల్గొనే వారు 9010437244, 9951229250, 9490007058 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రమణం వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పెద్దిరాజు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి నరేష్



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ విజ్ఞప్తి చేశారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా స్థానిక మిరియాం డిగ్రీ కళాశాలలో లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన న్యాయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏటా నవంబర్ 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని జరుపుకుంటామని పేర్కొన్నారు. నిరుపేదలు, బలహీన వర్గాలు, మహిళలు, పిల్లలకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు న్యాయపరమైన హక్కులపై అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఉచిత న్యాయ సలహాలు, లోక్ అదాలత్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలు ఉచిత న్యాయ సహాయం పొందాలని సూచించారు. ఉచిత న్యాయ సేవలు పొందే విధానాలపై సీనియర్ సివిల్ జడ్జి (సబ్ జూనియర్ డివిజన్) వి.గౌరీశంకరరావు అవగాహన పరిచారు. ప్యానల్ లాయర్లు వీకేఎస్ భాస్కర శాస్త్రి, కేవీవీ శ్రీనివాసరావులు ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

అలరించిన నృత్య ప్రదర్శనలు



వేడుకల్లో భాగంగా సన్మాన కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్ కుమార్ అధ్యక్షతన బీటెక్ మొదటి ఏడాది విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలను కళాశాల చైర్మన్ రామచంద్రరాజు, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కళాశాలలోని ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూకే పరిశోధనల విభాగాధిపతి రవీంద్ర, అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి లక్ష్య సాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సందీప్, కళాశాల విద్యాశాఖాధిపతి ఎస్ జయలక్ష్మి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు వృత్తి నైపుణ్యం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

అమలాపురం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు నెలకొల్పిన లోగోను మంత్రి సుభాష్ శనివారం ప్రారంభించి ప్రసంగించారు. ఈ అసోసియేషన్‌కు సంబంధించిన బ్రోచర్లను అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, పూర్వ విద్యార్థి రాఘవదత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, కళాశాల పాలక మండలి అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాసరావు, పాలక మండలి సభ్యులు పీకే రావు, డీఎస్ఎన్ రాజు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి తదితరులు ప్రసంగించారు.

పుదుచ్చేరి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్



హోరాహోరీగా తలపడుతున్న బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

- పాల్గొననున్న 500 మంది క్రీడాకారులు
- తొలిరోజు బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఖోఖో పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్

యానాం: విభిన్న సంస్కృతీ సంప్రదాయాలు, భాషల సమ్మేళనంతో అలరారుతున్న యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్ క్రీడాకారులు పాల్గొంటున్న పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి క్రీడలు జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలుస్తాయని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో 2024–25 ఏడాదికి గానూ రెండు రోజుల పాటు జరగనున్న ‘పుదుచ్చేరి స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్’ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించడంపైనే దృష్టి సారించాలన్నారు. నాలుగు రీజియన్‌లలో క్రీడాకారులను 8 జోన్లుగా విభజించి రెండు రోజుల పాటు క్రీడలు నిర్వహించనున్నారు. అంతకుముందు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి సన్యాసిరావు, స్టేడియం ఇన్‌చార్జి పివిఎస్ ప్రకాష్, పీఈటీలు పాము సత్యనారాయణ, చింతా వెంకన్న, కొప్పనాతి రమేష్, వడ్డి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

మొదటిరోజు శనివారం బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఖోఖో పోటీల్లో మాహే, కారైకల్, పుదుచ్చేరి, యానాం రీజియన్‌ల క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. బాలయోగి క్రీడా ప్రాంగణంలో ఖోఖో, వైఎస్సార్ స్టేడియంలో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జేఎన్‌టీయూకే వీసీ మురళీకృష్ణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీసీ మురళీకృష్ణ

తాళ్లరేవు: ఇంజినీరింగ్, ఫార్మసీ రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని, యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని అందిపుచ్చుకోవాలని జేఎన్‌టీయూకే వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ కోరారు. శనివారం కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించిన «ఎ టాక్ ఆన్ జోయ్ ఆఫ్ లెర్నింగ్» అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని ఉత్సాహభరిత వాతావరణంలో విద్య నభ్యసించాలన్నారు. ముఖ్యంగా ఫార్మసీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌లు నాగ సుబ్రహ్మణ్యం, జీవీ నాగరాజు, ఎం.స్వాతి, ఎస్.శ్రీవరిణిలు రూపొందించిన ‘టెక్స్‌బుక్ ఆఫ్ క్లినికల్ రీసెర్చ్ ప్రిన్సిపుల్స్, మెథడ్స్ అండ్ ప్రాక్టీస్’ అనే పుస్తకాన్ని మురళీకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దున్నా జనార్దనరావు, కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏఓ మాల తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధులతో పాఠశాలలో నూతన నిర్మాణాలు



తాళ్లరేవు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న పలు కోర్టుల నిర్మాణాలు

రన్నింగ్ ట్రాక్, క్రికెట్ కోర్టులు దెబ్బతింటాయని క్రీడాకారుల ఆవేదన

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులోని శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పీఎంశ్రీ నిధులతో నిర్మిస్తున్న పలు నిర్మాణాలపై క్రీడాకారులు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ (ప్రధానమంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా) పథకానికి తాళ్లరేవు హైస్కూల్ ఎంపికైంది. ఈ పథకం ద్వారా పాఠశాలలో ల్యాబ్‌లతో పాటు క్రీడా ప్రాంగణంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను నిర్మిస్తున్నారు. అయితే ఆయా నిర్మాణాల వల్ల ఎంతో చరిత్ర కలిగిన తాళ్లరేవు క్రీడా ప్రాంగణంలో రన్నింగ్ ట్రాక్, క్రికెట్ కోర్టులు దెబ్బతింటాయని భవిష్యత్‌లో క్రికెట్ ఆడేందుకు క్రీడా ప్రాంగణం అనుకూలించదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోనే విశాలమైన క్రీడా ప్రాంగణం కలిగి అనేక టోర్నమెంట్‌లు నిర్వహించిన చరిత్ర ఉందని, అయితే ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాల కారణంగా వాటికి ఆటంకం కలుగుతుందని ఆవేదన చెందుతున్నారు.

దీనిపై హైస్కూల్ హెచ్ఎం జె.ఆశాలతను వివరణ కోరగా కేంద్ర ప్రభుత్వ పథకానికి తమ స్కూల్ ఎంపికైందని, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అనుమతులు, కొలతలు తీసుకొని ఆయా నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు మేలు

ఉప్పలగుప్తం: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి కె.లక్ష్మీప్రసన్న సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ సంరక్షణ యోజన పథకంలో భాగంగా మండలంలోని భీమనపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు శనివారం ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రామకృష్ణ, సిబ్బంది సుభారత్నం పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

అమలాపురం టౌన్: పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై హత్యాయత్నం చేసిన నిందితుడిని పట్టణ ఎస్సై కిషోర్‌బాబు శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అమలాపురం సమీపంలోని కొంకాపల్లికి చెందిన కంచిపల్లి వెంకటేశ్వరరావును ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు. గత నెల 14న రాత్రి పాత కక్షల కారణంగా కంచిపల్లి శ్రీనివాసరావుపై ఇనుప రాడ్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడన్నది నేరారోపణగా పేర్కొన్నారు. నిందితుడు వెంకటేశ్వరరావుకు రిమాండ్ విధించారని చెప్పారు. అతడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

20న కాపు వన సమారాధన

అమలాపురం టౌన్: కార్తికమాసం సందర్భంగా ఈ నెల 20న అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో కాపు వన సమారాధన నిర్వహిస్తున్నట్లు కాపు నాయకులు వెల్లడించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో శనివారం జరిగిన కాపు నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. కాపు నాయకులు బోనం కనకయ్య, అల్లాడ స్వామి నాయుడు, నల్లా విష్ణుమూర్తి, గంధం పల్లంరాజు, నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, తిక్కిరెడ్డి నేతాజీ, కంచిపల్లి అబ్బులు తదితరులు సమావేశంలో ప్రసంగించారు.

ముత్యాలమ్మ సన్నిధిలో అన్నసమారాధన

తాళ్లరేవు: పవిత్ర కార్తికమాసం సందర్భంగా కేశవపురం ప్రధాన రహదారిలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ అన్న సమారాధనకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

వేంకటేశ్వరుడికి లక్షపత్రి పూజ



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో కొలువైన పద్మావతీ, అలమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామికి లక్ష తులసి పూజ, హోమాలు, పూర్ణాహుతి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ కారుపర్తి మల్లేశ్వరరావు శిష్య బృందంచే జరిగిన ఈ పూజా కార్యక్రమాలలో తొలుత స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, లక్ష కుంకుమార్చన జరిగింది. యక్కల సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీనివాస బాలమిత్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



కూనవరం మేజర్ డ్రెయిన్ వంతెనపై పెరుగుతున్న చెట్లు

ఉప్పలగుప్తం: సాధారణంగా చెట్లు నేలపై పెరుగుతుంటాయి. ప్రస్తుత కాలంలో వంతెనలపై సైతం అవి పెరుగుతూ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండలంలోని కూనవరం గ్రామంలో మేజర్ డ్రెయిన్‌పై ఉన్న వంతెనను చీల్చుకుని చెట్లు దర్శనమిస్తున్నాయి. మండలానికి సంబంధించి ఆయా శాఖ అధికారులు అనునిత్యం ఈ వంతెనపై ప్రయాణిస్తుంటారు. మరోపక్క వంతెనపై భారీ వాహనాలు రాకపోకలు చేయటంతో శిథిలావస్థకు చేరే పరిస్థితి కనిపిస్తుంది. వంతెన పరిస్థితి ఇంత అధ్వానంగా ఉన్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన మనుగడను కాపాడాలని కోరుతున్నారు.